క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 9న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. కిషన్‌పుర, లష్కర్ బజార్, పద్మాక్షికాలనీ, శివముక్తి ధామ్, రాజ్‌పుత్ వాడ, జయ కళాశాల ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, నగర శివారు భట్టుపల్లి, కొత్తపల్లి, ఇందిరమ్మ కాలనీ, దర్గా, సైనిక్‌పురి, అమ్మవారి పేట, శాయంపేట వ్యవసాయ ఫీడర్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు జోన్‌స్థాయి కబడ్డీ ఎంపికలు

హసన్‌పర్తి: హసన్‌పర్తిలోని జిల్లా పరిషత్ పాఠశాలలో హసన్‌పర్తి జోన్‌స్థాయి సబ్ జూనియర్ కబడ్డీ ఎంపికలు గురువారం నిర్వహించనున్నట్లు కబడ్డీ అసోసియేషన్ జోన్ అధ్యక్షుడు అటికం రవీందర్ తెలిపారు. హసన్‌పర్తి, ఆత్మకూర్, దామెర మండలాలకు చెందిన క్రీడాకారులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

సంక్రాంతి పురస్కారాల ఎంపికకు దరఖాస్తుల ఆహ్వానం

హన్మకొండ చౌరస్తా: వివిధ రంగాల్లో సామాజిక సేవలందించిన వారిని సంక్రాంతి విశిష్ట ప్రతిభా పురస్కారం –2025తో సన్మానించనున్నట్లు సర్వేజనా సుఖినోభవంతు సామాజిక, సాంస్కృతిక సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ డాక్టర్ ఈఎస్ఎస్ నారాయణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సాహిత్యం, సంగీతం, నృత్యం, కళలు, క్రీడలు, విద్య, వైద్యం, యోగా, క్రీడలు, సినీ, రంగస్థల కళాకారులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 96523 47207 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

అగ్ని ప్రమాదాలపై ప్రదర్శన



కాజీపేట రూరల్: హనుమకొండ అగ్నిమాపక స్టేషన్ సిబ్బంది ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాలపై కాజీపేట బాపూజీనగర్‌లోని విశ్వభారతి హైస్కూల్‌లో బుధవారం అవగాహన కల్పించారు. స్కూల్ హెడ్‌మాస్టర్ వెంకటరాజు ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఫైర్‌స్టేషన్ అధికారి దయాకర్, ఎల్ఎఫ్ కె.జనార్దన్, ఎఫ్ఎంలు ఎండీ.యాకూబ్, రత్నాకర్, గౌతము, ముని, ఉపాధ్యాయులు భారతి, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

ఊరెళ్తున్నారా జాగ్రత్త!

కాజీపేట: సంక్రాంతి సెలవుల్లో స్వస్థలాలకు వెళ్లే కుటుంబాలు తమ ఇంట్లో విలువైన వస్తువులు లేకుండా చూసుకోవాలని సీఐ సుధాకర్ రెడ్డి సూచించారు. కాజీపేట 61వ డివిజన్ ప్రశాంత్‌నగర్ కాలనీలో కాలనీవాసులతో ఆయన బుధవారం మాట్లాడారు. చోరీలు జరిగిన తర్వాత బాధపడడం కన్నా ముందే మేల్కోవడం మంచిదని పేర్కొన్నారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడంతో పాటు తరచూ సెల్‌ఫోన్లలో చెక్ చేసుకోవాలన్నారు. పక్కఇంటి వారికి ఇంటిని కాపాడే బాధ్యతలు అప్పగించడం ఉత్తమంటూ తగు జాగ్రత్తలు వివరించారు.

కేటీఆర్‌ను కలిసిన నాయకులు




హసన్‌పర్తి: బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావును బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా నాయకులు చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి, సుమన్ హైదరాబాద్‌లో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్‌కు బొకే అందించారు.

వ్యవసాయ మార్కెట్‌లో ఉచిత వైద్యశిబిరం

వరంగల్: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వ్యవసాయ మార్కెట్ అధికారుల సహకారంతో వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ, మెడికవర్ ఆస్పత్రుల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరాన్ని జేడీఎం ఉప్పుల శ్రీనివాస్ ప్రారంభించగా, వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, డీడీఎం పద్మావతి, ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.నిర్మల, చాంబర్ ప్రతినిధులు, గుమాస్తాలు, దడువాయిలు, రైతులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

గోదాదేవికి ప్రత్యేక అలంకరణ



వరంగల్ చౌరస్తా: వరంగల్‌లోని రామన్నపేట బట్టలబజార్ బాలానగర్ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ధనుర్మాసం 24వ రోజు బుధవారం విశిష్ట కదంబ ప్రసాద నివేదన కార్యక్రమం జరిగింది. గోదా అమ్మవారికి చీరలతో అలంకరణ, పండ్లు, పూలు, స్వీట్లు, డ్రైఫ్రూట్స్‌తో ఆరాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రత్నాకర్ రెడ్డి, చైర్మన్ శ్రీనివాసాచారి పాల్గొన్నారు.

ఎదురుచూపులు

- ప్రారంభానికి నోచుకోని మ్యూజియం
- పిచ్చిమొక్కలతో నిండిన భవనం ఆవరణ
- అసాంఘిక కార్యకలాపాలకు ఆవాసం

ఖిలా వరంగల్: మనసును కట్టిపడేసే ప్రకృతి అందాలు.. ఆధ్యాత్మిక, పర్యాటక కట్టడాలు.. పల్లె వాతావరణం.. ఆకర్షించే పర్యాటక ప్రాంతాలు కాకతీయుల రాజధాని ఖిలా వరంగల్ సొంతం. అయితే ఈప్రాంతం క్రమేణా నిరాధారణకు గురవుతోంది. పర్యటకం అంటే ఓరుగల్లు వైపు చూసేలా చేస్తామని పాలకులు ప్రగల్భాలు పలికినా క్షేత్రస్థాయిలో మాత్రం పర్యాటకులను ఆకర్షించే వసతుల కల్పనలో వెనుకబడినట్లు చెప్పవచ్చు. అధికారిక పర్యటనలో భాగంగా మహానగరానికి సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, ఇన్‌చార్జ్ మంత్రి శ్రీనివాస్‌రెడ్డి, మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, సీతక్క తదితరులు నగరంలో తరచూ పర్యటిస్తున్నప్పటికీ కోటవైపు మాత్రం చూడడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

మ్యూజియం ప్రారంభం ఎప్పుడో?

కాకతీయుల నిర్మాణాలు, ఆనాటి శిల్పకళా సంపదను వీక్షించాలని ప్రతిఒక్కరూ భావిస్తుంటారు. అయితే కాకతీయుల మధుర జ్ఞాపకాలు మదిలోనే నిక్షిప్తమా.. కనులారా వీక్షించే భాగ్యం లేదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. సీఎం పర్యటనతోనైనా మ్యూజియం ప్రారంభమవుతుందని భావించిన ప్రజల ఆకాంక్ష నెరవేరలేదు. కాకతీయుల కళాసంపదను ఒకచోట భద్రపర్చి భావితరాలకు అందించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన మ్యూజియం భవనం నేటికీ ప్రారంభానికి నోచుకోలేదు. కోట వీక్షణకు, పర్యటనకు వచ్చే ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు మ్యూజియం భవనాన్ని త్వరలోనే ప్రారంభిస్తామని చెబుతారే తప్ప అమలు చేయడం లేదు. మ్యూజియం భవన ప్రారంభం ఆలస్యం కావడంతో ఆవరణం మొత్తం పిచ్చిమొక్కలతో నిండిపోయింది. పశువులు, పాడి గేదెలకు ఆవాసంగా మారింది. అసాంఘిక శక్తులకు అడ్డాగా మారింది. కోటకు వచ్చే పర్యాటకులు ఆ భవనాన్ని చూసి నిరాశతో వెనుదిరిగి పోతున్నారు. భవన ప్రారంభంపై అధికార యంత్రాంగం, పాలక వర్గం ప్రత్యేక దృష్టి సారించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. భవనానికి తుది మెరుగులు దిద్ది 800 ఏళ్ల నాటి చరిత్రను వీక్షించేందుకు అవకాశం కల్పించాలని పర్యాటకులు కోరుతున్నారు.



మ్యూజియం భవనం వద్ద కట్టేసిన గేదెలు

మ్యూజియం ప్రారంభించాలి



మధ్యకోటలో నిర్మించిన మ్యూజియం భవనాన్ని వెంటనే పూర్తిచేసి ప్రారంభించాలి. కాతీయ కళా సంపదను భద్రపర్చి భావితరాలకు అందించేందుకు చర్యలు తీసుకోవాలి. మ్యూజియం భవనం పశువులకు ఆవాసంగా మారింది. చారిత్రక కోటకు వచ్చే పర్యాటకులకు మ్యూజియాన్ని చూసే అవకాశం కల్పించాలి.

– కొండ్రెడ్డి నవీన్‌రెడ్డి, రంగశాయిపేట

ప్రభుత్వానికి నివేదిక పంపాం



మ్యూజియం భవనానికి తుదిమెరుగులు దిద్దాల్సిఉంది. మ్యూజియం భవనాన్ని టూరిజం శాఖ పూర్తి చేసి పురావస్తుశాఖకు అప్పగిస్తే కాకతీయుల కళాఖండాలను పర్యాటకులు వీక్షించేలా చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే ప్రభుత్వానికి నివేదిక అందజేశాం. మ్యూజియం భవనాన్ని త్వరగా పూర్తిచేసి రాష్ట్ర పురావస్తు శాఖకు అప్పగించాల్సి ఉంది.

– మల్లునాయక్, ఏడీ, రాష్ట్ర పురావస్తుశాఖ, వరంగల్

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- సైబర్ క్రైం ఏసీపీ విజయ్‌కుమార్



మాట్లాడుతున్న ఏసీపీ విజయ్‌కుమార్

వరంగల్ క్రైం: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వరంగల్ పోలీస్ కమిషనరేట్ సైబర్ క్రైం ఏసీపీ విజయ్‌కుమార్ సూచించారు. నగరంలోని హంటర్‌రోడ్డులోని సాంఘిక సంక్షేమ పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ మోసాలపై నిత్యం అప్రమత్తంగా ఉండాలని, ఎవరికీ కూడా వ్యక్తిగత సమాచారం ఇవ్వొద్దని అన్నారు. ప్రస్తుతం సైబర్ నేరగాళ్లు డిజిటల్ అరెస్టు పేరుతో మోసాలకు పాల్పడుతున్నారని, పోలీసులు ఎప్పుడూ డిజిటల్ అరెస్టులు చేయరని వివరించారు. సైబర్ మోసానికి గురైనట్లు గ్రహిస్తే తక్షణమే 1930 నంబర్‌కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ రవి, సుబేదారి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త

హసన్‌పర్తి: రోజురోజుకు టెక్నాలజీ ఎంత వేగంగా అభివృద్ధి చెందుతుందో.. అదేస్థాయిలో సైబర్ నేరాలు కూడా పెరిగి పోతున్నాయని కాకతీయ యూనివర్సిటీ పోలీస్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు. భీమారంలోని గౌతమ్ జూనియర్ కళాశాలలో 'డిజిటల్ అరెస్ట్'పై బుధవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజిటల్ యుగంతో సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారని, ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా మోసగిస్తూనే ఉన్నారని చెప్పారు. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి బెదిరింపు కాల్స్ వస్తే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సైలు రవీందర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

బినామీలను ఏరివేసి అర్హులకు ప్లాట్లు ఇవ్వాలి



మార్కెట్ కార్యదర్శి నిర్మలకు వినతి పత్రం అందజేస్తున్న కూరగాయల వ్యాపారులు

వరంగల్: వరంగల్ లక్ష్మీపురంలోని మోడల్ కూరగాయల మార్కెట్‌లో కొంతమంది కమీషన్ పేరిట మడిగెలు (షట్టర్లు) పొందిన, అదనంగా ఓపెన్ ప్లాట్లు తీసుకున్న వారిని గుర్తించి వారిస్థానంలో అర్హులైన చిల్లర వ్యాపారులకు ప్లాట్లు కేటాయించాలని వరంగల్ జిల్లా హోల్‌సేల్ అండ్ రిటైల్ వెజిటేబుల్ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు బిట్ల కృష్ణ, ప్రధాన కార్యదర్శి సామల రాజులు కోరారు. ఏనుమాముల మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.నిర్మలకు బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వ్యాపారులు మాట్లాడుతూ తోట సుధాకర్, చల్ల సదానందం, పల్లం రవికి కమీషన్ లైసెన్సులు, మడిగెలు ఇచ్చినప్పటికీ అదనంగా ఓపెన్ ప్లాట్లు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని పేర్కొన్నారు. మార్కెట్‌లో గ్రేడ్ –2 కార్యదర్శి తన బంధువులకు 2 ప్లాట్లు, కూరగాయల మార్కెట్‌లో సూపర్‌వైజర్లుగా పనిచేసిన ఉద్యోగులు తమ వారికి ప్లాట్లు నిబంధనలకు విరుద్ధంగా కేటాయించారని తెలిపారు. అలాంటి ప్లాట్లను గుర్తించి అర్హులకు ఇప్పించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రేడ్ –2 సూపర్‌వైజర్ అంజిత్‌రావు, కమిటీ ఉపాధ్యక్షుడు నమిండ్ల సూరయ్య, సభ్యులు మంద రంజిత్, మేడారం శ్రీను, మహేష్, బూర ప్రకాశ్, శేఖర్, హరీష్, సురేష్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

- ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

ఖిలా వరంగల్: ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని ఎంపీ కడియం కావ్య, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతుల భవన నిర్మాణ పనుల శిలాఫలకాన్ని బుధవారం ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉంటారని, మధ్యాహ్నం రుచికరమైన భోజనం, అల్పాహారం, ఉచిత దుస్తువులు, పుస్తకాలు, తదితర వసతులు కల్పిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఆనంద బాబు, స్థానికులు పసునూరి వేణుగోపాల్, రాజు, ఎండీ.జానీ, తాటికాయల కృష్ణంరాజు, ఆకుల మధు, భరత్, సంపత్, మహేష్ పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

రక్తదానం.. ప్రాణదానం



హన్మకొండ: రక్తదానం మరొకరికి ప్రాణదానమని టీజీఎస్ ఆర్టీసీ వరంగల్ డిప్యూటీ రీజినల్ మేనేజర్లు మాధవ రావు, కేశరాజు భానుకిరణ్ అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా హనుమకొండలోని ఆర్టీసీ వరంగల్ రీజియన్ కార్యాలయంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రైవర్లు ప్రమాదాలు జరగకుండా వాహనాలు నడపాలని సూచించారు. ప్రమాదాల నివారణ ప్రతీఒక్కరి బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ పాలక మండలి సభ్యుడు శ్రీనివాస్‌రావు, పుల్లూరి వేణు, డిపో మేనేజర్లు వంగల మోహన్ రావు, భూక్యా ధరంసింగ్, ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో రక్తదాన శిబిరం

విద్యారణ్యపురి: హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల (కో ఎడ్యుకేషన్)లో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు ప్రారంభించి మాట్లాడారు. రక్తదానం.. మరొకరికి ప్రాణదానం అని అన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రాజ్‌కుమార్, వలంటీర్లు, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

కేయూలో వర్క్‌షాప్ బ్రోచర్ ఆవిష్కరణ

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని కొత్తగూడెం ఇంజనీరింగ్ కళాశాలలో ఏఐసీటీఈ ఈ–ట్రైనింగ్ అండ్ లెర్నింగ్ అకాడమీ సహకారంతో ఈనెల 27నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. ఈమేరకు వర్క్‌షాప్ బ్రోచర్‌ను కేయూలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డితో కలిసి వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి బుధవారం ఆవిష్కరించారు. అడ్వాన్స్‌మెంట్ ఇన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మిషన్ లెర్నింగ్ ఫర్ మోడర్న్ ఇంజనీరింగ్ సొల్యూషన్స్ అనే అంశంపై ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జగన్మోహన్ రాజు తెలిపారు. ఈ వర్క్‌షాప్‌లో పాల్గొనేందుకు ఇంజనీరింగ్ అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు, పరిశ్రమల నిపుణులు ఈనెల 18వ తేదీలోపు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.కాకతీయ.ఏసీ.ఇన్‌లో చూడవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగం డీన్ ప్రొఫెసర్ సదానందం, కోఆర్డినేటర్ డాక్టర్ కిశోర్‌కుమార్, కేయూ ఇంజనీరింగ్ కళాశాలల ప్రిన్సిపాళ్లు డాక్టర్ రమణ, డాక్టర్ భిక్షాలు, తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్, తదితరులు

యూజీసీ పేస్కేల్ అమలు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న కాంట్రాక్టు ప్రొఫెసర్లు

కేయూ క్యాంపస్: యూనివర్సిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల రెగ్యులరైజేషన్ ప్రక్రియ ఆలస్యమైతే యూజీసీ పేస్కేల్ అమలు చేయాలని, తమ సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేయాలని కాకతీయ యూనివర్సిటీ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల కోఆర్డినేటషన్ కమిటీ బాధ్యులు కోరారు. ఈమేరకు వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డికి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈమేరకు అకడమిక్ కమిటీ హాల్‌లో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల కోఆర్డినేషన్ కమిటీ బాధ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెగ్యులర్ రిక్రూట్‌మెంట్ కంటే ముందుగానే తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి, కేయూ పాలక మండలి సభ్యులు డాక్టర్ చిర్ర రాజు, కమిటీ బాధ్యులు డాక్టర్ సతీష్, డాక్టర్ సాదు రాజేష్, శ్రీధర్‌కుమార్ లోథ్, నర్సింహారావు, మాదాసి కనకయ్య, సత్యజాల, నాగయ్య, వెంకటేష్, సూర్యనారాయణ, లక్ష్మారెడ్డి, సంగీత్, మామిడి లింగయ్య, సదాశివ్, రఘువర్ధన్, రాధిక, ఉషాకిరణ్ పాల్గొన్నారు.

దళితుల అభ్యున్నతిలో శ్రీహరి కీలకపాత్ర



మాట్లాడుతున్న పెరుమాండ్ల రామకృష్ణ

హన్మకొండ చౌరస్తా: దళితుల హక్కుల సాధన, అభ్యున్నతిలో స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కీలకపాత్ర పోషిస్తున్నారని కాంగ్రెస్ ఎస్సీ సెల్ డిపార్ట్‌మెంట్ హనుమకొండ జిల్లా చైర్మన్ డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ గుర్తుచేశారు. హనుమకొండలోని తన కార్యాలయంలో ఎస్సీ సెల్ డిపార్ట్‌మెంట్ నాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ కడియం శ్రీహరి ఏ పదవిలో ఉన్నా దళితుల కోసం పాటుపడుతూనే ఉంటారని అన్నారు. గురుకులాల ఏర్పాటు, ఎస్సీ వర్గీకరణ, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల పెంపుపై కడియం ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీతోనే దళితుల అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ బాధ్యులు కొమ్ముల బాబు, శ్వేత, మేరీ, రమేష్, భిక్షపతి, చంద్రమౌళి, సాంబయ్య, రాజు, వినయ్, సుకన్య పాల్గొన్నారు.

బీఆర్ఎస్ వినూత్న నిరసన

హన్మకొండ: రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతూ బీఆర్ఎస్ వినూత్న నిరసన తెలిపింది. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ముగ్గుల పోటీ, పతంగుల ఎగురవేత కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు పలు ముగ్గులు వేసి ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపారు. హామీలను గుర్తు చేశారు. అదేవిధంగా వుయ్ లవ్ కేటీఆర్, వుయ్ ఆర్ విత్ కేటీఆర్ అని రాసిన గాలి పటాలను ఎగరవేశారు. అనంతరం ముగ్గుల పోటీల విజేతలకు బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పులి రజనీకాంత్, సంకు నర్సింగ్, బోయినపల్లి రంజిత్ రావు, బొంగు అశోక్, లోహిత, కుసుమ లక్ష్మీనారాయణ, జోరిక రమేష్, రఘు, మహేష్, వీరస్వామి, ఖలీల్, రజిత, జ్యోతి, దేవమ్మ, విజయలక్ష్మి, సరస్వతి పాల్గొన్నారు.



ముగ్గును పరిశీలిస్తున్న వినయ్‌భాస్కర్

మాజీ ఎంపీ వ్యాఖ్యలపై నిరసన



వరంగల్ చౌరస్తా: ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, ఎంపీ ప్రియాంక గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ నేత, మాజీ ఎంపీ రమేష్ బిదూరిపై చర్య తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వరంగల్ స్టేషన్ రోడ్డులోని మహాత్మాగాంధీ విగ్రహం ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్ మాట్లాడుతూ రమేష్ బిదూరిని ఆ పార్టీ నుంచి వెంటనే సస్పెండ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జారతి రమేష్, నాయకులు సందెల లాజర్, ఎర్ర కమల్, గూడ శారద, పాడిశెట్టి సరళ దేవి, గూడ రమ్య, పోలెపాక విశాల్ బాబు, కొమ్ము అమర్, పోలెపాక యాకూబ్, దౌడు నాగరాజ్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కార్యాలయంపై దాడి హేయం



హసన్‌పర్తి: భారతీయ జనతా పార్టీ ప్రధాన కార్యాలయంపై కాంగ్రెస్ నాయకులు చేసిన దాడి చేయడం హేయమైన చర్య అని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గురుమూర్తి శివకుమార్ ఆరోపించారు. హసన్‌పర్తిలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల వరకే రాజకీయాలు చేయాలని, ఆ తర్వాత సంక్షేమం కోసం పనిచేయాలని సూచించారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టాలన్నారు. చిల్లర రాజకీయాలు చేస్తే సహించేది లేదన్నారు. సమావేశంలో బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ తాళ్లపల్లి కుమారస్వామి, రైల్వే బోర్డు సభ్యుడు రాజు, డివిజన్ అధ్యక్షుడు మారం తిరుపతి, నాయకులు సత్యం, పెద్దమ్మ శ్రీనివాస్, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

స్పందన ఆశ్రమానికి కెనరా బ్యాంక్ చేయూత

హన్మకొండ: హనుమకొండ సర్క్యూట్ హౌస్ రోడ్డులోని స్పందన మానసిక వికలాంగుల ఆశ్రమానికి కెనరా బ్యాంక్ చేయూతనందించింది. రూ.50 వేల విలువైన బీరువాలు, వాటర్ ప్యూరిఫయర్, పడకలను కెనరా బ్యాంక్ చీఫ్ రీజినల్ మేనేజర్ చంద్రశేఖరన్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం ప్రతిఏటా ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. కార్పొరేట్ సంస్థలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో అనురాగ్ హెల్పింగ్ సొసైటీ అధ్యక్షురాలు కరుకాల అనితారెడ్డి, కెనరా బ్యాంక్ ఏజీఎంలు శాంతికుమార్, మాధవి, డీఎం సంతోష్‌కుమార్, రాఘవేంద్ర, నారాయణ, యువజ్యోతి, ఇంద్రజ, విజయ్ కుమార్, శ్రీనివాస్, వసుధ, హరిత పాల్గొన్నారు.

17న పాటల పల్లకి

నయీంనగర్: ఈనెల 17న హనుమకొండ పబ్లిక్ గార్డెన్ నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణంలో 12 గంటల పాటల పల్లకి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఉద్యమ కవి, గాయకుడు నేర్యాల కిశోర్ తెలిపారు. గత ప్రభుత్వం తెలంగాణ ఉద్యమ కళాకారులను పట్టించుకోకుండా అన్యాయం చేసిందని, నిరుద్యోగ ఉద్యమ కళాకారులను కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈమేరకు పాటల పల్లకి పోస్టర్లను హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో టీపీసీసీ సాంస్కృతిక సేన రాష్ట్ర అధ్యక్షుడు చక్రాల రఘుతో కలిసి బుధవారం ఆవిష్కరించారు. అనంతరం రఘు మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కవులు, కళాకారులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో గజవెల్లి ప్రతాప్, గడ్డం సుధాకర్, పాలాటి రాజు, మోతె రమేష్, క్రాంతికుమార్, బుల్లెట్ వెంకన్న పాల్గొన్నారు.

శివను వెంటనే అరెస్ట్ చేయాలి

ఖిలా వరంగల్: తన భర్త మృతికి కారణమైన శివను వెంటనే అరెస్ట్ చేసి చట్టప్రకారం శిక్షించాలని బాధితురాలు సంధ్యారాణి డిమాండ్ చేశారు. ఈమేరకు పడమర కోటలో తాపీమేస్త్రీ గూడూరు శివ ఇంటి ముందు బంధువులతో కలిసి బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను ఎండీ.హుస్సేన్‌ను ప్రేమించి కులాంతర వివాహం చేసుకున్నానని, తన భర్త భవన కార్మికుడిగా పనిచేస్తూ తనతోపాటు ఇద్దరు పిల్లలను పోషించేవాడని చెప్పారు. తన భర్త మృతికి గూడూరు శివపై పలు రకాల అనుమానాలు ఉన్నాయన్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని సీఐటీయూ హనుమకొండ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ డిమాండ్ చేశారు. యూనివర్సిటీలో యూనియన్ కార్యాలయంలో బాధ్యుడు రాంచందర్ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన సమావేశంలో రమేష్ మాట్లాడారు. యూనివర్సిటీలో 25ఏళ్లుగా వివిధ విభాగాలు, కళాశాలు, హాస్టళ్లలో పనిచేస్తున్న ఆయా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని సూచించారు. సమావేశంలో తెలంగాణ యూనివర్సిటీస్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మెట్టు రవి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కచ్చకాయల చిరంజీవి, ప్రధాన కార్యదర్శి దేశిని రవికుమార్, బాధ్యులు రాజు, మధు, శోభన్ కుమార్, శ్రీనివాస్, రమేష్, కృష్ణ, రవి, ప్రభాకర్, సందీప్, రణదీర్, రంజిత్ పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో ఇరుముడి ధారణ

కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రం ఆవరణలోని అయ్యప్పస్వామికి గురుస్వాముల శరణుఘోషల మధ్య బుధవారం గోక్షీరాభిషేకం నిర్వహించారు. దేవాలయ వ్యవస్థాపక అధ్యక్షుడు ఐనవోలు వెంకటేశ్వర్లు శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి మహార్చన జరిపించి ప్రత్యేకంగా అలంకరించారు. గురుస్వామి ఐనవోలు సాయి కృష్ణ శర్మ నేతృత్వంలో 25 మంది అయ్యప్ప మాలధారులకు ఇరుముడి ధారణ జరిగింది.

గ్రంథాలయ వనరులను వినియోగించుకోవాలి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని గ్రంథాలయ వనరులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కేయూ గ్రంథాలయ సభ్యుడు, ఇన్‌చార్జ్ సీజే.శ్రీలత కోరారు. విశ్వవిద్యాలయంలోని లైబ్రరీ సైన్స్ విభాగంలో ప్రెషర్స్ డే సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విభాగం అధిపతి డాక్టర్ రాధికారాణి మాట్లాడారు. వర్సిటీలోని గ్రంథాలయాన్ని వినియోగించుకొని పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. సమావేశంలో డాక్టర్ సుజాత, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు దక్కేలా చూడాలి

కాజీపేట: పట్టణంలో నిజంగా నిలువ నీడలేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు వచ్చేలా కమిటీ సభ్యులు కృషి చేయాలని కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ సూచించారు. కాజీపేట 62వ డివిజన్ రహమత్‌నగర్ కాలనీ ప్యారడైజ్ ఫంక్షన్ హాల్‌లో ఇందిరమ్మ డివిజన్ కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎనున్నుకున్నారు. కమిటీలో నాగపురి లలిత, ఎంవీ.రాజు, పి.ఆంజనేయులు, సుంచు అశోక్, బి.రమేష్, బుర్ర బాబురావు తదితరులు పాల్గొన్నారు.

మల్లారెడ్డిని పదవి నుంచి తొలగించాలి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డిని ఆ పదవి నుంచి తొలగించాలని, ఎలాంటి పరిపాలన పదవులు ఇవ్వొద్దని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తిరుపతి, నాయకులు చింత ఆంజనేయులు కోరారు. ఈమేరకు వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డికి బుధవారం వినతిపత్రం అందజేశారు.

జయముఖి కళాశాల గుర్తింపు రద్దుచేయాలి

వరంగల్: జయముఖి ఇంజనీరింగ్ కళాశాలలో డీఫార్మసీ చదువుతున్న అవినాష్‌రెడ్డి మృతికి కారణమైన కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవడంతో పాటు గుర్తింపును రద్దు చేయాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్, శనిగరపు రాజేంద్రప్రసాద్ కోరారు. ఈమేరకు కలెక్టర్ సత్యశారదకు స్వేరోస్, ఏబీఎస్ఎఫ్ నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు.

కాశీ విశ్వేశ్వరుడి సొత్తు ఎండోమెంట్‌కు అప్పగింత

వరంగల్: కాశిబుగ్గలోని కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయంలోని శివాలయంలో దేవతామూర్తుల అలంకరణ వస్తువులను ఆలయ ఈఓ ఎస్.వెంకటరావు, ఇన్‌స్పెక్టర్ అనిల్‌కు అప్పగించినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ పూర్వ సభ్యులు డాక్టర్ గోనె జగదీశ్వర్, మండల శ్రీరాములు, బోడకుట్ల వైకుంఠం, డాక్టర్ మామిడి ఈశ్వరయ్య, రమేష్ తెలిపారు.

అపార్ట్‌మెంట్‌పై నుంచి పడి తాపీమేస్త్రీ మృతి

కాజీపేట: కాజీపేట 61వ డివిజన్ ప్రశాంత్‌నగర్ కాలనీలో నిర్మాణంలో ఉన్న ఓ అపార్ట్‌మెంట్‌పై నుంచి కిందపడి వలస కార్మికుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈమేరకు మృతుడి భార్య కాజీపేట పోలీస్ స్టేషన్‌లో బుధవారం రాత్రి ఫిర్యాదు చేసింది. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన కిశోర్‌కుమార్ మోర్ జారి (50) బతుకుదెరువు నిమిత్తం కాజీపేటకు భార్య, పిల్లలతో వచ్చి తాపీమేస్త్రీగా పనిచేస్తున్నాడు. అపార్ట్‌మెంట్ పైఅంతస్తులో పని చేస్తుండగా బుధవారం సాయంత్రం ప్రమాదవశాత్తుగా కాలు జారి కిందపడి మృతిచెందాడని ఎస్సై నవీన్ కుమార్ తెలిపారు.

రహదారి భద్రత ప్రతీ పౌరుడి బాధ్యత

ఖిలావరంగల్: రహదారి భద్రత ప్రతీ పౌరుడి బాధ్యత అని ఎంవీఐ జైపాల్‌రెడ్డి, శోభన్ బాబు అన్నారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా వరంగల్ ఆర్టీఏ కార్యాలయంలో ఏఓ నరేందర్ అధ్యక్షతన రోడ్డు భద్రతపై వాహనదారులకు బుధవారం సాయంత్రం అవగాహన కల్పించారు. అనంతరం రోడ్డు భద్రతపై వాహన చోదకులతో ఆర్టీఏ అధికారులు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏఎంవీఐలు మద్దెల నరేందర్, ఉదయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక సేవల్లో ముందుండాలి

దేశాయిపేట: వ్యాపారులు వ్యాపారంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండాలని దేశాయిపేట వర్తక సంఘం శాశ్వత అధ్యక్షుడు ఆడెపు రవీందర్ సూచించారు. ఐనవోలు సమీపంలోని ఒక రిసార్ట్‌లో సంఘం 12వ వార్షికోత్సవ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన ఎన్నికల్లో సంఘం ప్రధాన కార్యదర్శిగా వీరగోని విజయభాస్కర్ రెడ్డి, కోశాధికారిగా శిరుప మాధవ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

చిత్రలేఖన పోటీల్లో 'సెయింట్ పీటర్స్' ప్రతిభ

హన్మకొండ: జాతీయస్థాయి చిత్రలేఖన పోటీల్లో హనుమకొండ హౌజింగ్ బోర్డు కాలనీలోని సెయింట్ పీటర్స్ సెంట్రల్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ జి.మత్యాస్ రెడ్డి తెలిపారు. ఈమేరకు పాఠశాలలో బహుమతులు పొందిన విద్యార్థులు, డ్రాయింగ్ టీచర్ రాపోలు శ్రీనివాస్‌ను ప్రిన్సిపాల్‌తో పాటు డైరెక్టర్ సునీతారెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.